# ఎ స్టోరీ ఫర్ ఎడల్ట్స్

## సుస్మితా రమణమూర్తి

"అమ్మా! ప్రక్కింటికెళ్ళి కేరంబోర్డు ఆడుకుంటామ," హరి భయం భయంగా తల్లి ముఖంలోకి చూస్తూ అడిగాడు.

"వెధవా! ఎప్పుడూ ఆటలేనా? నీ కంటే తమ్ముడు నయం! బడిలోకింకా వెళ్ళకపోయినా ఎంత బుద్ధిగా అక్షరాలు దిద్దుకుంటున్నాడో చూడు !?..."

గదిలో ఓ మూల పలకమీద రాసిన అక్షరాలను శ్రద్ధగా దిద్దుకుంటున్న చిన్నకొడుకు రాజాని చూపిస్తూ అంది నీరజ.

హరి బిక్కముఖం వేశాడు.

"స్కూల్సుకెలాగూ సెలవులిచ్చేశారు. ప్రయివేటుక్కూడా సెలవులేవా ?" గట్టిగా అరుస్తూ అడిగింది నీరజ.

"ఇవాళ ప్రయివేటుకి రావద్దన్నారమ్మా! రేపట్నుంచి రమ్మన్నారు."

"ప్రయివేటులేదని వూరుమీద పడదామనుకుంటున్నావా? అదేం కుదరదు. అయిన పాఠాలు మరోసారి చదువుకో."

"అన్నీ వచ్చేసాయమ్మా !"


"పుస్తకం తెరిస్తే అన్నీ వచ్చేసినట్లే వుంటాయ్! పుస్తకం మూసేస్తే మళ్ళీ అన్నీ కొత్తగానే వుంటాయ్! అందుకని పాఠాల వెనుకనున్న ప్రశ్నలన్నింటికీ జవాబులు చూడకుండా రాసి చూపించు. ఆ తర్వాత వెళ్ళి ఆడుకుందువుగాని."


చేసేదేమీలేక, "అలాగేనమ్మా !" అంటూ తన పుస్తకాల బల్లదగ్గరకు వెళ్ళిపోయాడు హరి.

"రాజా! తర్వాత దిద్దుకుందువుగాని ముందీపాలు తాగు !"

"హుం! నాకైతే కాఫీకూడా ఇవ్వదు. తమ్ముడికైతే రెండు పూటలా గ్లాసుడేసి పాలు! వాడు చదువుకోకపోయినా ఫర్వేదు. నేను మాత్రం ఎప్పుడూ చదువుకుంటూ వుండాలి. ఎక్కడికీ వెళ్ళకూడదు. ప్రక్కింట్లో కేరంబోర్డు ఆడుకోకూడదు. ఈపాటికి వాళ్ళంతా హాయిగా బోర్డాడుకుంటుంటారు. అలా ఆడుకుంటే వాళ్ళమ్మలు కోప్పడరూ ?... అంతా ఈ 'అమ్మ'లా వుంటారేంటి ?... ఉండరు !... వాళ్ళమ్మలు ఎంతో మంచోళ్ళు!... ఈ 'అమ్మే' చాలా చెడ్డది. ఆడుకుంటే అలసిపోతానట !... బట్టలు పాడైపోతాయట !... దెబ్బలు తగులుతాయట !... నీరసపడిపోతానట ! ... ఆటల్లో పడితే చదువు పాడైపోతుందట. మార్కులు తక్కువ వస్తాయిట. పరీక్షలన్నింటిలో మార్కులు నాకు బాగానే వస్తున్నాయే! మరలాంటప్పుడు ప్రతివిషయానికీ ఎందుక్కాదంటుంది !? ... బళ్ళో ఎంతమంది పిల్లలు ఇంటర్వెల్లో ఆడుకోటంలేదు? అప్పుడు కూడా నేను ఆడుకోకూడదు. వీధిలో ఎంతమంది నాలాంటి వాళ్ళు ఆడుకోటంలేదు ? వాళ్ళంతా బాగావున్నారే !? ... మరి నేనెందుకు వాళ్ళందరిలా ఆడుకోకూడదు ? ... అమ్మీమధ్య నా గురించి అసలు పట్టించుకోడంవే మానేసింది. ఇదివరకు ఎంతబాగా చూసుకునేది!? రెండు పూటలా ఇప్పుడు తమ్ముడికిస్తున్నట్లు గ్లాసునిండా పాలిచ్చేది. గ్లూకోజు నీళ్ళిచ్చేది. ఇంకా మంచి మంచి పళ్ళిచ్చేది. ఎంతో ముద్దుగా చూసుకునేది. అప్పుడంతా అమ్మకు నా గురించి ధ్యాసే! ప్రయివేటుకి — స్కూలుకి తోడువచ్చేది. ఆడుకున్నా నవ్వుతూ కోప్పడేదేగాని ఇప్పట్లా కొట్టడం, తిట్టడం విసుక్కోడం చేసేదికాదు. అప్పుడెంతో హాయిగా వుండేది. అమ్మ ఎంతో మంచిదని మురిసిపోయేవాణ్ణి! అలాంటి అమ్మిప్పుడెందుకిలా మారిపోయింది ? ప్రతిసారీ ఎందుకు కొడుతూంది ? 'తమ్ముడికేనా పాలు ? మరి నాకో ?' — అంటే — "వాడు చిన్నోడురా! వాడిక్కాక నీకా పాలు ? ఆకలిగా వుంటే కాసేపుండు అన్నం తిందువుగాని" అంటుంది గాని ఈమధ్య పాలివ్వడంవే మానేసింది. నాన్నగారే అప్పుడప్పుడు పాలిస్తారు. అమ్మకి నాన్నంటే భయం! ఎందుకుండదూ భయం ? నాన్నకి ఇంతింత మీసాలుంటాయి కదా? అందుకే కాబోలు అమ్మకి భయం! మరి నాన్నంటే నాకు భయం లేదే !? ... భయం వేయదే !? ... ఎంచేతో !? ... ఆఁ! తెల్సింది. నాన్నెప్పుడూ పిల్లలతో నవ్వుతూ మాట్లాడుతారు. మంచి మంచి కథలు చెబుతారు. అమ్మలా విసుక్కోరు. కసురుకోరు. కొట్టనే కొట్టరు. నిజంగా






నాన్నగారు చాలా మంచివారు. తనెప్పుడూ ఇంటి దగ్గరే వుండిపోతే ఎంత బాఁవుణ్ను ? అమ్మచేత తిట్లు — చీవాట్లు — దెబ్బలు తప్పేవి. నాన్న గారింటి దగ్గరుండిపోతే డబ్బులెలా వస్తాయ్?..." పుస్తకాల ముందు కూర్చున్న హరి ఆలోచనలు అలా సాగిపోతున్నాయ్.

"హరీ ! ఏం చేస్తున్నావ్ ? చూడకుండా జవాబులు రాస్తున్నావా ? అలా బొమ్మలా కూర్చున్నావేం ?" అటువేపు ఏదో పనిమీద వచ్చిన నీరజ అలా అనేసరికి హరి వులిక్కిపడి—

"ఆఁ, రాస్తున్నానమ్మా ! చూడకుండానే రాస్తున్నాను" అంటూ సర్దుక్కూర్చున్నాడు బుద్ధిగా. పది నిముషాలు వంచిన తలెత్తకుండా ప్రశ్నలకు జవాబులు చూడకుండా రాసిన హరి పెన్ను ఆగిపోయింది. పెన్నులో సిరా అయిపోయిందేవోనని ఓసారి గట్టిగా దులిపి మళ్ళీ రాయడంలో లీనమైపోయాడు. ఓ నాలుగు వాక్యాలు రాసిం. తర్వాత మళ్ళీ పెన్ను రాయడం మానేసింది. మరోసారి దులిపి రాయడానికి ప్రయత్నించినా లాభం లేకపోయింది. పెన్నులో సిరా పూర్తిగా అయిపోయింది. సిరా పోసుకుందాఁవని బీరువా పైనున్న సిరాబుడ్డిని తీయబోయిన హరి చేతిలోంచి పొరపాటున అది క్రిందపడి ముక్కలు ముక్కలైపోయింది. శబ్దం విన్న నీరజ ప్రక్క గదిలోంచి ఆత్రంగా వచ్చింది.

"ఏఁవిట్రా! మళ్ళీ ఏఁవిటి తగలెట్టేశావ్?" అంటూ.

హరి బిక్కముఖం వేశాడు. భయంతో బిగిసిపోయాడు.

సిరా పడ్డంవల్ల ప్రక్కనున్న బట్టలు — పుస్తకాలు పాడవడం చూసిన నీరజ, "వెధవా ! నీకెన్నిసార్లు చెప్పాల్రా ? నీకేదైనా కావాల్సొస్తే నన్నడగమని ? ఇప్పుడు నీకా ఇంకుబుడ్డి అవసరం యేఁవొచ్చింది ?" అంటూ రెండు చెంపల్నీ ఎడాపెడా వాయించేసింది.

హరి చెంపలమీద నీరజ చేతివ్రేళ్ళు అచ్చు గుద్దినట్లు కన్పిస్తున్నాయ్. రెండు చెంపలూ బాగా కందిపోయి ఎర్రబారాయ్.

## ఎ స్టోరీ ఫర్ ఎడల్ట్సు

'కొట్టకమ్మా ! ఇంకెప్పుడూ తీయనమ్మా!' అంటూ వెక్కిళ్ళు పడసాగేడు హరి.

"అసలిప్పుడీ ఇంకు బుడ్డి అవసరఁవే వొచ్చింది నీకు ?" కళ్ళెర్రజేస్తూ అడిగింది నీరజ.

"మరేఁవో పెన్నులో ఇంకయిపోయింది. అందుకని..." ఏడుస్తూ మధ్య మధ్య విషయాన్ని చెప్పాడు తను.

"వెధవా ! ఇంకు పోతేపోయింది. పుస్తకాలు చీరలు పాడయ్యాయ్. ఈసారి మళ్ళీ ఎప్పుడైనా ఇంకుబుడ్డి జోలికి వెళ్ళావో జాగ్రత్త ! వీపు విమానంమోత మ్రోగించేస్తాను." అంటూ బట్టల్ని సీట్లో ముంచటానికి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది తను.

మంట పెడుతున్న చెంపల్ని తడుముకుంటూ కుమిలి కుమిలి యేడ్వసాగేడు హరి — "ఈ అమ్మెప్పుడూ ఇంతే ! ఎప్పుడూ ఇలాగే కొడుతుంది. ఈ అమ్మ చాలా చెడ్డది !" అనుకుంటూ. అమ్మ చాలా చెడ్డది! అమ్మ చాలా చెడ్డది !!... హరి ఆలోచనలనిండా అమ్మ నిండిపోయింది. ఈమధ్య ప్రతీ చిన్న విషయం గురించి విసుక్కుంటోంది అమ్మ ! ఎక్కువసేపు పడుకోకూడదు. ఆడుకోకూడదు. అందరు పిల్లలతో స్నేహం చేయకూడదు. ఐస్‌ఫ్రూట్లు— జీళ్ళు కొనుక్కోకూడదు. ఇంటర్‌వల్‌లో అంతా ఎన్నో కొనుక్కుని తింటుంటారు. వాళ్ళు తింటూ వుంటే తినాలనుంటుంది. డబ్బులుండవు. అమ్మనడిగితే, 'వెధవా ! కావాల్సిందేదో ఇంట్లో తినుగానీ— చిరుతిళ్ళు ఆరోగ్యానికి మంచివి కాదంటుంది. మరి వాళ్ళంతా తింటున్నారే !?... వారి ఆరోగ్యం పాడవటం లేదే !? అవేవీకాదు. అమ్మకి నేనంటే ఇష్టంలేకే అలా అంటూంది. తమ్ముడంటేనే అమ్మకి ప్రేమ ! నామీదసలు ప్రేమ లేనేలేదు. అమ్మ ఎక్కడికి వెళ్ళినా తమ్ముణ్ణే తీసుకు వెళ్తుంది నన్నసలు తీసుకెళ్ళడఁవే మానేసింది. సినిమాక్కూడా ఎప్పుడోగాని తీసుకువెళ్ళదు. అదైనా నాన్నగారుంటారు కాబట్టి తీసుకెళ్తుంది. తను వెళ్ళినప్పుడల్లా తమ్ముణ్ణి తీసుకెళ్తుంది. 'తమ్ముడికి టిక్కెట్టు అడగరు. నీకైతే అడుగుతార్రా !' అంటుంది. 'ఒకోసారి ఆ సినిమాలు నీలాంటి చిన్నోళ్ళు చూడకూడదురా !' అంటుంది. మరి తమ్ముడు నాకంటే చిన్నోడు కాదూ !?... నేనూ వస్తానని గొడవచేస్తే చెంపలు వాయించేస్తుంది. బుర్ర వుండు పడేలా మొట్టికాయలు మొడుతుంది. ఎంచేతనో అమ్మకి రోజు రోజుకీ నామీద ప్రేమ లేకుండా పోతోంది.

నాన్నగారితోనైనా చెప్పుకుందాఁవంటే నిద్రపోయింతర్వాతెప్పుడో వొస్తారు. ఎప్పుడు చూచినా ఓవర్‌టైము అంటారు. ఇదివరలో ఎన్నిసార్లు— 'నాన్నా ! అమ్మ కొట్టింది' అని నే చెప్పుకోలేదు ? నాన్నగారు మాత్రం ఏంచేస్తారు? ఓసారి గట్టిగా కేకలేస్తారు. ఓ రెండ్రోజుల్దాకా అమ్మయేఁవీ అనదు. ఆ తర్వాత మళ్లీ మామూలే! ఈ మధ్య రాజమండ్రి పెదనాన్న రావడఁవే మానేశారు. తనొచ్చినా బాఁవుణ్ను ! తనొస్తే ఎంచక్కా ఓ నెల్రోజుల్దాకా వుంటారు. ఆ నెల్రోజులూ ఎంతో హాయిగా వుంటుంది. నన్నెంతో ప్రేమగాచూసుకుంటారు. చాక్‌లెట్లు— ఐస్‌ఫ్రూట్లు — స్వీట్లు కొనిపెడతారు. సినిమాలకి—బీచ్‌కి తీసుకెళతారు. అర్థంకాని పాఠాల్ని— లెక్కల్ని చెబుతారు. ఈ అమ్మ నాన్నలకంటే తనకి నేనెంతో ఇష్టం ! అమ్మకి నా మీద ఇష్టంలేనప్పుడు పెదనాన్నతో నన్నెందుకు పంపించదో !?... పాపం పెదనాన్నకి పిల్లలు లేరట ! నన్నెన్నోసార్లు పెంచుకుంటానని అడిగారు. నాన్న ఎటూ తేల్చకుండా నువ్వునవ్వి హిస్తే అమ్మ మాత్రం "మాకు మాత్రం ఎందరున్నారండీ ? ఇద్దరేకదా ? ఊహ తెల్సిన పదేళ్ళ కుర్రాడు మీ దగ్గరేం వుంటాడండీ ?" అంటుంది.

అమ్మ కాదన్నా — నాన్న యేఁవీ అనకపోయినా ఇంకా అప్పుడప్పుడు నా గురించి అడుగుతూనే వున్నారు పెదనాన్న. పెదనాన్న ఇల్లు ఎంతో బాఁవుంటుంది. అక్కడైతే కేరంబోర్డు

వుంది. ఎంచక్కా ఆడుకోవచ్చు. ఎక్కడికీ వెళ్ళనవసరంలేదు. ఇంట్లోనే చక్కగా కావాల్సినంతసేపు ఆడుకోవచ్చు. పెదనాన్నతో ఆడుకోడానికి చుట్టుపక్కల పిల్లలంతా వస్తారు. అక్కడెంతో హాయిగా వుంటుంది. సందడిగా వుంటుంది. పెద్దమ్మకూడా ఎంతో మంచిది. కిందటేడు వాళ్ళింటికి వెళ్ళినప్పుడు నన్ను చూసి ఎంతో పొంగిపోయింది. ఎంతో ముద్దుగా చూసుకుంది. పొద్దున్న — సాయంత్రం హార్లిక్సు కలిపిన పాలిచ్చేది. యాపిల్ పళ్ళిచ్చేది. ఇంకా యేవేవో తినమనేది. ఈ అమ్మ అడిగినా ఏవీ పెట్టదు. ఆ అమ్మ అడక్కుండానే అన్నీ పెడుతుంది. ఈసారి పెదనాన్న వస్తే తనతో వెళ్ళిపోతానని పేచీపెట్టాలి. తను ఎప్పుడొస్తాడో?... పోనీ నేనే పెదనాన్నింటికి వెళ్ళిపోతే.. అమ్మో! ఒక్కణ్ణే వెళ్ళగలనా ? ఎందుకెళ్ళలేను ? ... బస్సుస్టాండుకి వెళ్తే బస్సొస్తుంది. ఇక్కడ బస్సెక్కి అక్కడ దిగిపోవచ్చు. అక్కడికెళ్ళి అమ్మ గురించి పెద్దమ్మతో చెబితే — ఇక్కడికి పంపించకుండా అక్కడే వుంచేసుకుంటుంది నన్ను. మరి బస్సు టిక్కెట్టుకి డబ్బులో? అల్మారాలో ఎప్పుడూ డబ్బులుంటాయికదా ? ... అందులోంచి తీసుకుంటే సరి !

... ... ... ... ... ...

... ... ... ... ... ...

... ... ... ... ... ...

ఆ చిన్నారి బుర్రలో అలా ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయ్. తప్పకుండా తను పెదనాన్న దగ్గరకు వెళ్ళిపోవాలన్న నిర్ణయం క్షణక్షణానికి ధృవపడుతోంది తన మస్తిష్కంలో.

* * *

"హరీ! రేయ్ హరీ!" మొదట నెమ్మదిగా— తర్వాత కాస్త గట్టిగా పిల్చినా హరికి తండ్రి పిలుపు వినిపించలేదు.

కారణం — ఏదో రాస్తూ రాస్తూ టేబులు మీద బుర్రపెట్టి నిద్రలోకి జారిపోయాడు హరి.

'వీడికీ మధ్య చదువుమీద శ్రద్ధ బాగా పెరిగింది. మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడు. తనుకూడా కాస్త కోచింగిస్తే ఇంకా మంచి మార్కులు వచ్చేవి !...ఇంతకీ రాస్తున్నది నోట్సా ? లేక లెక్కలు చేస్తున్నాడా ? ... చదువుకుంటూ నిద్రపోయినట్లున్నాడే ? ... ' స్వగతంలా అనుకుంటూ ఆ పుస్తకాన్ని అందుకుని చూడసాగేడు హరి తండ్రి రంగనాథం. అది హరి రోజూ రాసుకునే డైరీ ! రంగనాథంకున్న మంచి అలవాట్లలో 'డైరీ' రాయడం ఒకటి. ఆ మంచి అలవాటు హరికి కూడా అలవడేట్లు చేశాడు తను.

"అమ్మకి నేనంటే అసహ్యం ! ఎప్పుడూ కొడుతుంది. తిడుతుంది. నాన్నగారు మాత్రం కొట్టరు. నాన్నగారెప్పుడో తప్ప ఇంటి దగ్గర వుండరు ...




ది
న
ఆంధ్రపత్రికలో
త్రి
క

★ మన సినిమాలు
★ దినవారఫలాలు
★ ఇది వారి దృక్పథం

★ డాక్టరు కబుర్లు
★ పల్లెసీమ
★ యుద్ధకాండ

★ కలైడోస్కోపు కార్టూన్
★ శ్రీకృష్ణభాగవతం
★ వింతయథార్థం

★ ఇంకా — వ్యాసాలు,

గేయాలు, కార్టూన్లు ....

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో

సరికొత్త ఆకర్షణలు

ప్రవేశపెడుతూనే ఉంటాము !

వెంటనే ఆంధ్రపత్రిక

చందాదారుగా చేరండి !

* * *



డా. కె.యల్. నారాయణ



వైద్యాచార్య
చర్మవ్యాధులకు, స్త్రీల వ్యాధులకు, పక్షవాతం, ముఖ వ్యాధులకు, సెక్సు, నరముల బలహీనతలకు, ఆయుర్వేద చికిత్స.
పోస్టుద్వారా చికిత్స కలదు.

లక్ష్మీకుమారి క్లినిక్,
మెయిన్ రోడ్, తెనాలి.



Join atOnce

EFFICIENT POSTAL TUITION


1. M.B.A., M.B.M., D.B.A., A.M.I.B.A., B.G.L., M.A., M.COM.
(FOR DEGREE HOLDERS)
2. D.COM., I.COM., B.COM., B.COM(HONS)., M.COM., ALL ONE SITTING.
(S.S.L C./H S C./P U C./INTER PASSED OR FAILED ARE ALLOWED)
3. OSMANIA B.A., B.COM(ONE SITTING)
(FOR P U C/INTER H S C/ CANDIDATES)
4. B.A., B.COM., M.A.,(M.U.)
(NO PREVIOUS QUALIFICATION REQUIRED)
5. A.M.I.E., A.M.I.MECH. E EQUIVALENT TO B.E.,
(FOR S S L.C /P U C/H S C CANDIDATES)
6. ALLOPATHY
7. E. HOMOEOPATHY
8. S.S.L.C., 9. H.S.C.,


POPULAR AND EFFICIENT INSTITUTE IN THE WORLD

*For Particulars Send Rs. 3/- by M.O.*

SRI MURUGAN TUTORIALS
(ESTD:21-3-1952 GOVT.REGD.NO. 3072)
H O · RISHIVANDIYAM-606 205 (T.N.)

R.O : 41. ARCOT ROAD
KODAMBAKKAM. MADRAS-600 024




తమ్ముణ్ణే బాగా చూస్తోంది. వాడేం జేసినా పట్టించుకోదు. నేనేం జేసినా కొడ్తోంది. అమ్మని చూస్తుంటేనే భయంగా వుంటోంది.

పక్కింటి పిల్లలతో ఆడుకుంటే కోప్పడుతుంది. పెన్సిలు పారేసుకున్నా— పెన్ను పాలీ పొరపాటున క్రిందపడి పాడైపోయినా గట్టిగా బాదేస్తుంది. ఈ అమ్మకి తనమీద అసలు ప్రేమ వుంటేకదా ? నన్ను బాగా చూడ్డానికి ?

అమ్మకి నిజంగా తనమీద ప్రేమ లేనేలేదు. తమ్ముడంటేనే ప్రేమ. పాలు— పళ్ళూ ఎప్పుడూ వాడికే ఇస్తుంది. సినిమాలకి వాణ్ణే తీసుకెళ్తుంది. మంచి మంచి బట్టలు వాడికే కొని పెడ్తోంది. ఇదివర్లో నన్ను కూడా బాగా చూసేది. ఈ మధ్య నేనంటే అమ్మకి గిట్టడం లేదు... ...

అమ్మకి నేనంటే నిజంగా పగే ! ఎందుకో అర్థం కావటంలేదు. ప్రతి చిన్న పనికీ కొట్టేస్తోంది. ఇంకుబుడ్డి చేయి జారిందని గట్టిగా కొట్టేసింది. నాన్నతో చెబుదామన్నా తనేరాత్రికో గాని రారు...

పెదనాన్నకి, పెద్దమ్మకి నేనంటే ఎంతో ముద్దు, ప్రేమ. పాపం వాళ్ళకి పిల్లలు లేరట. నన్ను పెంచుకుంటానని ఎన్నోసార్లు అడిగారు. అమ్మ కిష్టంలేదు. ఎందుకిష్టం వుంటుంది? నే వెళ్ళిపోతే తిట్టడానికి— కొట్టడానికి ఎవరూ వుండరు కదా ?... అందుకనే నన్ను పంపటం లేదు .. ...'

అమ్మ తిట్లు— దెబ్బలు తప్పించుకోవాలంటే వెంటనే పెదనాన్న దగ్గరకు వెళ్ళిపోవాలి. రేపు మధ్యాన్నం అమ్మ సినిమాకు వెళ్తుందట. అప్పుడు అల్మారాలోని డబ్బులు తీసుకుని బస్సెక్కి— రాజమండ్రి వెళ్ళిపోతాను. అప్పుడీ అమ్మగొడవ వుండదు..."

డైరీలో ఏ పేజీ చూసినా అమ్మకి తనంటే ఇష్టం లేదన్న విషయం— తను పెదనాన్న దగ్గరకు వెళ్ళిపోవాలన్న విషయం హరి మనస్సులో గాఢంగా ముద్రపడిన సంగతి గమనించిన రంగనాథం కొన్ని నిముషాలు కలవరం చెందాడు.

## ఎ స్టోరీ ఫర్ ఎడల్ట్స్

బాధ పడ్డాడు.

అనుకోకుండా వీడి డైరీ చూడబట్టి విషయం తెల్సిందిగాని — లేకుంటే అనుకున్నట్టు వీడు చేసేవాడే !!......

అదృష్టం బాగాలేకుంటే — ఎదురుచూడనిదేమైనా జరిగితేనో ! ?... ఇదంతా నీరజవల్లే జరిగింది. — అనుకుంటూ రంగనాథం బాధతో విలవిల్లాడిపోయాడు. వెంటనే విసురుగా నీరజ దగ్గరకు వెళ్ళాడు తను.

నీరజ ఏదో వారపత్రిక తిరగవేస్తోంది.

"నీరజా ! మన పెద్దాడి ప్రవర్తన ఈమధ్య ఎలా వుందంటావ్ ? బుద్ధిగా వుంటున్నాడా ?" తను చెప్పబోయేదానికి వుపోద్ఘాతంగా అడిగాడు.

"ఎలా వుంటుందని అడుగుతున్నారా ? రాను రాను మరీ రణపెంకి అయిపోతున్నాడు. చిన్నాడికి పాలిస్తే — వాడూ కావాలంటున్నాడు. గొడవ గొడవ చేస్తున్నాడు. ప్రతి విషయంలోనూ చిన్నాడితో పోల్చి చూసుకుంటున్నాడు. కోపం వచ్చి కొడితే ఏడుస్తాడుగాని మన పరిస్థితి అర్థం చేసుకోడు. ఇదివర్లో పెద్దాణ్ణే మాత్రం మనం ముద్దుగా చూసుకోలేదటండీ ? ఇప్పుడు కూడా వాడికి — పాలు — పళ్ళు వగైరాలన్నీ చిన్నాడితోబాటే ఇవ్వాలంటే మీకొస్తున్న జీతం ఎలా సరిపోతుందండీ ? మరీ ఇలా ప్రతిదానికీ మొండికేస్తుంటే ఎలా చెప్పండి ?"

"ఒక విధంగా అందుకు బాధ్యులం మనమే అనుకుంటాను. ఒక్కొక్కప్పుడు వాళ్ళు అలా తయారవడానికి కారణం మన ప్రవర్తనే అవొచ్చు. పిల్లల్ని మంచి పద్ధతిలో వుంచేందుకు మనం అవలంబించే పద్ధతుల్లోనే అప్పుడప్పుడు లోపాలు వుండొచ్చు. ప్రశాంతమైన వాతావరణంలో అనురాగం ఆత్మీయతల మధ్య పెరిగే పిల్లలు భవిష్యత్తులో మంచి పౌరులుగా అవడానికి ఎంతో అవకాశముంది."

భర్త చెబుతున్నదేమిటో అర్థంగాక తెల్లముఖంవేస్తూ రెప్పలార్పకుండా తన ముఖంలోకి తదేకంగా చూడసాగిందామె.

"మన దృష్టిలో ఒకడు పెద్ద— మరొకడు చిన్న అయినప్పటికీ నిజానికి ఇద్దరూ చిన్నవాళ్ళే కదా ? మనం ఏంజేసినా వారి బాగుకోసమే అయినా — మనం చేస్తున్నదేమిటో ? తద్వారా ఆ పసిహృదయాలెలా ఫీలవుతున్నాయో ?— అన్న విషయం గ్రహించాల్సిన అవసరం బాధ్యత మనమీదుంది. ఇకమీదట్నుంచి బట్టల విషయంలో గాని — తిండి విషయంలోగాని... ఒక్కటేమిటి అన్ని విషయాల్లోనూ ఇద్దరినీ ఒకేలా చూడ్డం ఎంతో అవసరం. చాలా మంచిదికూడా. పదిసార్లు పిల్లల్ని కోపగించుకుని — కొట్టి — తిట్టి మన మార్గంలోకి మళ్ళించుకోడంకంటే — ఒక్క ఆప్యాయతతోకూడిన పిలుపుతో వాళ్ళను మనవేపు మరల్చుకోగలగడం చాలా గొప్ప విషయం !"

నీరజ ఏదో చెప్పబోయింది.

అందుకు అవకాశమీయకుండా రంగనాథం మళ్ళీ చెప్పసాగేడు.

"పిల్లల మనస్సు గాయపడకుండా మంచి మాటలతో, ప్రేమతో మనకు కావల్సిన విధంగా తీర్చిదిద్దుకోడం అంత కష్టమేమీ కాదు. ఇద్దరూ చిన్నవాళ్ళే ! ఇద్దరినీ ఒకేలా చూడ్డం చాలా అవసరం. ఈ పసివయస్సులో వారి మనస్సులు గాయపడ్డం అంత మంచిదికాదు. ఆర్థిక ఇబ్బందులు గురించి నీ వాట్టే పట్టించుకోకు. అవన్నీ నే చూసుకుంటాను. ఇక మీదట్నుంచైనా మన పద్ధతుల్ని మార్చుకోడం చాలా అవసరం. నే చెప్పిందేమిటో — చెప్పదలచుకుందేమిటో... ఈ డైరీ చూస్తే పూర్తిగా నీకే అర్థం అవుతుంది." అంటూ హరి డైరీ నీరజకు అందించాడు తను.

డైరీలోని విషయాలద్వారా హరి పరిస్థితిని బాధని పూర్తిగా అర్థం చేసుకున్న నీరజ కొన్ని క్షణాలు తెల్లబోయింది. భర్త చెప్పిన మాటల్లోని నిజాన్ని — అంతరార్థాన్ని అద్దంలాంటి హరి పసిహృదయాన్ని డైరీద్వారా పూర్తిగా తెల్సుకోగలిగింది, చూడగలిగింది. ★